సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

మంగళవారం 25-2-2025

సంపుటి: 20 సంచిక: 283

పేజీలు: 8 వెల: రూ.1



## జనసేన సమన్వయకర్తగా కొరికాన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జనసేన పార్టీ జిల్లా సమన్వయకర్తగా సుడా చైర్మన్ కొరికాన రవికుమార్‌ను నియమిస్తూ ఆ పార్టీ అధిష్టానం సోమవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేసింది. మార్చి 14న పిఠాపురంలో డిప్యూటీ సీఎం, పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ అధ్యక్షతన నిర్వహించబోయే పార్టీ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా పార్టీ సమన్వయకర్తలను నియమించారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జిలు, పీవోసీలు, మండల అధ్యక్షులతో సమావేశాలు నిర్వహించి ఆవిర్భావ వేడుకలు విజయవంతం చేసే బాధ్యతను పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ సమన్వయకర్తలకు అప్పగించారు. సుడా చైర్మన్ కొరికాన రవికుమార్‌ను పార్టీ సమన్వయకర్తగా నియమించడం పట్ల ఆ పార్టీ నాయకులు, ఇన్‌ఛార్జిలు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.


## బెట్టింగ్ కోసం..

- ఆలస్యంగా వెలుగుచూసిన సర్వేయర్ నిర్వాకం
- సర్వీసు మొత్తం వసూళ్లు, అక్రమాలే
- రికవరీ కోసం తిప్పలు పడుతున్న అధికారులు

# పింఛను సొమ్ము స్వాహా







సొమ్ముతో సర్వేయర్ పరారీ

...ట్యాస్‌టుడే: జి.సిగడాం పెంట గ్రామ సచివాలయ సర్వే... భానుప్రతాప్ రూ.49 వేల పింఛన్ నగదుతో పరారీ అయి... సోమవారం తహసీల్దారు శ్రీకాంత్, ఎంపీడీవో రామకృష్ణలకు ... చేశారు. 2024 జూన్ నుంచి పెంట గ్రామ సచివాలయ పరిధిలో పింఛను పంపిణీలో భాగంగా భాను ప్రతాప్‌కు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటివరకు సజావుగా విధులు నిర్వర్తించిన ఆయన ఫిబ్రవరికి సంబంధించి పింఛన్ల సొమ్ము మొత్తం రూ.1.66 లక్షలకుగాను రూ.1.17 లక్షలు పంపిణీ చేశారు. మిగతా రూ.49 వేలు ఇస్తామని చెప్పి పరారీ అయినట్లు సచివాలయ సిబ్బంది ఫిర్యాదులో పేర్కొన్నారు. పింఛనుదారులకు ఇబ్బంది కలగకుండా సచివాలయ సిబ్బంది తమ సొంత డబ్బులతో సర్దుబాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో మృతులకు చెందిన సొమ్ము తిరిగి ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉందని చెబుతున్నారు. భానుప్రతాప్ డిప్యూటేషన్‌పై జిల్లా అదనపు సంచాలకులు సర్వే అండ్ ల్యాండ్ రికార్డు శాఖలో విధులు నిర్వహిస్తున్నాడు. వారిని కూడా సంప్రదించగా ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి తమ కార్యాలయానికి విధులకు రాలేదని ఏడీ సమాధానం ఇచ్చారని, కుటుంబ సభ్యులను ఆరా తీయగా అయిదు రోజులుగా అతడి ఆచూకీ తెలియలేదని చెబుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జి.సిగడాం మండలం పెంట గ్రామ సచివాలయ సర్వేయర్ చదువుల భానుప్రతాప్ రూ.49వేల పింఛను నగదుతో పరారైన 15 రోజుల తర్వాత సదరు సచివాలయ సిబ్బంది ఈ నెల 17న తహసీల్దారు శ్రీకాంత్, ఎంపీడీవో రామకృష్ణలకు ఫిర్యాదు చేశారు. భానుప్రతాప్ ఆచూకీ ఇప్పటికీ తెలియలేదని సన్నిహితులు చెబుతున్నారు. భానుప్రతాప్ డిప్యూటేషన్‌పై జిల్లా అదనపు సంచాలకులు సర్వే అండ్ ల్యాండ్ రికార్డు శాఖలో విధులు నిర్వహిస్తున్నాడు. జిల్లా కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సర్వేయర్ భానుప్రతాప్‌కు 2024 జూన్ నుంచి పెంట గ్రామ సచివాలయ పరిధిలో పింఛను పంపిణీ బాధ్యతను అప్పగించారు. జిల్లా ఏడీ కార్యాలయంలో డెప్యూటేషన్‌పై విధులు నిర్వహించే భానుప్రతాప్ పొందూరుకు చెందినవాడు. పెంట గ్రామ సచివాలయం నుంచి డెప్యూటేషన్‌పై జిల్లా కార్యాలయంలో చేరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్ల పంపిణీలో డెప్యూటేషన్‌పై పని చేస్తున్న సచివాలయం ఉద్యోగులంతా వారు పని చేసేచోట హాజరు కావాలని ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయి. ఆ మేరకు జూన్ నుంచి భాను ప్రతాప్ పెంట సచివాలయం పరిధిలో పింఛన్ల పంపిణీలో పాల్గొంటూ ఉండేవాడు. సర్వే శాఖ ఏడీతో సన్నిహితంగా తిరిగే సర్వేయర్ భానుప్రతాప్ ఈ నెల ఒకటో తేదిన ఫిబ్రవరికి సంబంధించి పింఛన్ల సొమ్ము మొత్తం రూ.1.66 లక్షలకు గాను రూ. 1.17 లక్షలు పంపిణీ చేశారు. మిగతా 11 మంది లబ్ధిదారులకు సంబంధించిన రూ.49వేలు ఆయన వద్దనే అట్టిపెట్టుకొని పత్తా లేకుండాపోయారు. ఒకటో తేదీ శనివారం కావడంతో భానుప్రతాప్‌కు ఇచ్చిన టార్గెట్ మేరకు రూ.1.17 లక్షలు పంపిణీ చేసేశాడు. మిగతా 11 మంది లబ్ధిదారులకు మూడో తేది సోమవారం పంపిణీ చేస్తానని చెప్పి రూ.49వేలు పట్టుకు పోయాడు. మూడో తేదీన భానుప్రతాప్ తన తల్లికి బాగులేదని చెప్పి సచివాలయానికి రాకుండా డమ్మాకొట్టాడు. నాలుగో తేదిన వచ్చి పంపిణీ చేసేస్తానని, పింఛన్ తీసుకోవడానికి సచివాలయానికి వచ్చిన 11 మంది లబ్ధిదారుల నుంచి బయోమెట్రిక్ తీసుకోవాలని వెల్ఫేర్ అసిస్టెంట్‌కు చెప్పినట్టు తెలిసింది. దీంతో సచివాలయ సిబ్బంది 11 మంది లబ్ధిదారుల వేలిముద్రలను తీసుకొని తర్వాత రావాలని సూచించారు.




### ఇంటి పన్ను సొమ్ము ఇచ్చారు

పింఛను మొత్తం ఎందుకు ఇవ్వడం లేదని లబ్ధిదారులు ప్రశ్నిస్తే.. డబ్బులు బ్యాంకు అకౌంట్‌లో ఉండిపోయాయని, ఫోన్‌పే లిమిట్ దాటిపోవడం వల్ల 24 గంటల వరకు సాధ్యం కాదని నచ్చజెప్పి సచివాలయ సిబ్బంది పంపించారని తెలిసింది. తర్వాత రోజు 11 మంది లబ్ధిదారులు పింఛన్ డబ్బుల కోసం సచివాలయ సిబ్బందిని నిలదీయడం ప్రారంభించారు. ఫోన్ స్విచాఫ్ చేసి ఉండడంతో భానుప్రతాప్ ఇంటికి వెళ్లి సచివాలయ సిబ్బంది వాకబు చేశారు. తల్లికి బాగులేదని, ఆసుపత్రిలో చేర్చి ట్రీట్‌మెంట్ చేయడానికి రూ.49వేలు ఖర్చు చేసినట్టు సచివాలయ సిబ్బందికి భానుప్రతాప్ చెప్పిన విషయాన్ని వారికి వివరించారు. కానీ భానుప్రతాప్ తల్లి మాత్రం గత - మిగతా చివరి పేజీలో






## పొందూరు ఖాదీపై లఘుచిత్రం

- 'వీవింగ్ లైవ్స్' పేరుతో ప్రదర్శన
- ఉత్తమ అవార్డు గెలుచుకున్న డాక్యుమెంటరీ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రపంచ ప్రఖ్యాత పొందూరు ఖాదీ బ్యాక్‌డ్రాప్‌గా చేనేత కార్మికుల జీవితాలను ప్రతిభింబించేలా తీసిన లఘు చిత్రం 'వీవింగ్ లైవ్స్' ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ తెలంగాణలో ఉత్తమ డాక్యుమెంటరీ అవార్డ్ గెలుచుకుంది. ఈ డాక్యుమెంటరీని సంపత్ పవన్ ఫిల్మ్ కంపెనీ, శ్రీకాకుళం హవా కలిసి నిర్మించారు. ఈ ప్రాజెక్ట్‌లో పలువురు ప్రతిభావంతులైన వ్యక్తులు సహకారాన్ని అందించారు. అంతర్జాతీయ వేదికపై ఇలాంటి గుర్తింపు పొందడం శ్రీకాకుళం జిల్లాకు గర్వకారణంగా చెప్పుకోవచ్చు. 'వీవింగ్ లైవ్స్' పేరుతో తీసిన లఘు చిత్రానికి ఉత్తమ డాక్యుమెంటరీ అవార్డు రావడం పట్ల కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పందిస్తూ ఒక ట్వీట్ చేశారు. ఆ తర్వాత 'వీవింగ్ లైవ్స్' మేకర్స్ బృందం సభ్యులతో కలిసి లఘుచిత్రాన్ని వీక్షించారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో ఫిల్మ్ మేకర్స్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలో నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో జిల్లాకు చెందిన సినీ మేకర్స్ ప్రతిష్టాత్మక అవార్డు గెలుచుకోవడం పట్ల పలువురు ప్రజాప్రతినిధులు చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. పొందూరు ఖాదీ చరిత్రను ప్రధానంగా చూపించే డాక్యుమెంటరీ బెస్ట్ డాక్యుమెంటరీ ఫిల్మ్‌గా ఎంపిక కావడం జిల్లా ఖ్యాతిని మరింత పెంచిందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ డాక్యుమెంటరీ ద్వారా పొందూరు ఖాదీ ప్రాముఖ్యత, చారిత్రక నేపథ్యం, ఆ ప్రాంత ప్రజల కృషిని ప్రపంచానికి తెలియజేయడం పట్ల చిత్ర బృందానికి జిల్లా ప్రజలు అభినందిస్తున్నారు. నేతకార్మికుల జీవితాల్ని ప్రతిబింబించేలా రూపొందించిన 'వీవింగ్ లైవ్స్' లఘు చిత్రం అంతర్జాతీయ వేదికపై హైదరాబాద్‌లో ఘనంగా ప్రదర్శించడాన్ని పలువురు జిల్లా ప్రముఖులు కొనియాడారు. ఈ చిత్రానికి రవీంద్ర భారతి, ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో ప్రత్యేక స్క్రీనింగ్ నిర్వహించారు. ఈ ప్రదర్శనలకు సినీ రంగ ప్రముఖులు, మీడియా ప్రతినిధులు, సినీ ప్రియులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. 'వీవింగ్ లైవ్స్' చిత్రం ప్రేక్షకుల నుంచి మంచి స్పందనను అందుకుంటోంది. కథా విషయంగా నూతన ఒరవడిలో సాగిన ఈ చిత్రం ప్రేక్షకుల మనసులను దోచుకుంటుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. చిత్రప్రదర్శనకు అవకాశం ఇచ్చి తిలకించిన అందరికీ చిత్రబృందం కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఈ సినిమా నేపథ్యం, తీయడానికి పడిన కష్టం, మానవ సంబంధాలను అందంగా అల్లుకున్న విధానం గురించి మేకర్స్‌కు వివరించారు. అవార్డు ఇచ్చిన స్ఫూర్తితో దేశవ్యాప్తంగా మరిన్ని ప్రదర్శనలు, ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ఈ సినిమాను ప్రదర్శించడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. మేకర్స్, టెక్నీషియన్స్ బృందంలో పవన్ రాజీవ్ లోచన్, తేజసాయి కొల్లి, అజిత్ బల్లెడ, కూర్మి నాయుడు వరుదు, ప్రగ్యాన్ గోకెడా, సంతోష్, నాని, ఓంకార్, ఆదిత్య, నిఖిల్ మంగలంపల్లి, తరుణ్ నాయుడు, బాబ్జి రేగాన, అరవింద్ యాదవ్, నాగు లండా, లోకేష్ కందుకూరి ఉన్నారు. కొన్ని నెలల పాటు సమయాన్ని వెచ్చించి ఎన్నో వ్యయప్రయాసలతో తీసిన లఘుచిత్రానికి తగిన గుర్తింపు లభించందని మేకర్స్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.











## బ్యాంకు సిబ్బంది సహకారంతోనే..

- నేరగాళ్లకు ఖాతాదారుల ఖాతా వివరాలు
- ఏటా భారీగా నమోదు అవుతున్న సైబర్ నేరాలు
- గత ఏడాది 11 లక్షల పైగా సైబర్ ఫ్రాడ్ కేసులు
- ఒక్క 2023లోనే హైదరాబాద్‌లోని మూడు కమిషనరేట్లలో కలిపి రూ.450 కోట్లు పోగొట్టుకున్నట్లు అధికారులు వెల్లడి
- సైబర్ నేరగాళ్ల ఆగడాలకు కొందరు బ్యాంకు ఉద్యోగులు దన్ను

జేబులో చెయ్యి పెట్టనక్కరలేదు.. గోడలు దూకాల్సిన పని అంతకన్నా లేదు.. తలుపులు బద్దలు కొట్టాల్సిన అవసరమే లేదు.. ఒక్క క్లిక్‌తో లక్షలు హాంఫట్. ప్రస్తుత కాలంలో పెరిగిపోయిన సైబర్ నేరాల తీరిది. గుట్టు చప్పుడు కాకుండా, మనకే తెలియకుండా మన బ్యాంకు ఖాతా ఖాళీ అవుతుంది. దేశంలో సైబర్ నేరాలు అతి పెద్ద సమస్యగా మారాయి. సాధారణ నేరాల కంటే అత్యధికంగా నమోదు కావడమే కాకుండా కోట్ల రూపాయలు సొత్తు నేరగాళ్లు కాజేస్తున్నారు. మరి మన బ్యాంకు ఖాతాలో ఎంత డబ్బు ఉందో నేరగాళ్లకు ఎలా తెలుస్తోంది? అనే ప్రశ్న తలెత్తవచ్చు. దీనికి సంబంధించిన మినిస్ట్రీ ఆఫ్ హోం ఎఫైర్స్‌కు సైబర్ క్రైం ఇంటిలిజెన్స్ అధికారులు ఇచ్చిన నివేదిక విస్తుపోయే విషయాలను వెల్లడించింది. బ్యాంకుల్లో పనిచేసే వారి నుంచే నేరగాళ్లకు ఖాతాదారుల ఖాతా వివరాలు అందుతున్నాయని, సైబర్ నేరగాళ్లు నకిలీ బ్యాంక్ ఖాతాలు తెరవడానికీ కొందరు బ్యాంకు అధికారులు కూడా సహకరిస్తున్నారని నివేదికలో సైబర్ ఇంటిలిజెన్స్ టీం స్పష్టం చేసింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖను, ఆర్బీఐ అధికారులను సైబర్ ఇంటిలిజెన్స్ టీం అలర్ట్ చేసింది.

బాలకృష్ణ ఎం, సీనియర్ జర్నలిస్ట్





### ఏటేటా పెరుగుతున్న సైబర్ నేరాలు

పెరుగుతున్న టెక్నాలజీకి అనుగుణంగానే సైబర్ నేరాలు కూడా విపరీతంగా పెరిగిపోతున్నాయి. వివిధ రకాల పద్దతులను పాటించి నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. చదువులేని వారితో పాటు విద్యావంతులు, వ్యాపారస్తులు, సంపన్నులు కూడా వీరి వలలో పడి సొమ్ములను పోగొట్టుకుంటున్నారు. మోసాలు చేయడానికి సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతులను ఎంచుకుంటున్నారు. అయితే, ప్రతీ ఏటా భారీగా నమోదవుతున్న సైబర్‌నేరాల కట్టడికి ప్రజలు అప్రమత్తంగా ఉండడమే మార్గమని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. ముందస్తు అప్రమత్తత, కనీస రక్షణ చర్యలు తీసుకుంటే చోరీలను నివారించే అవకాశముంది. సైబర్ నేరాల్లో మాత్రం కొందరు తేలిగ్గా నేరగాళ్ల బుట్టలో పడిపోతున్నారు. పెట్టుబడులు, క్రిప్టో కరెన్సీ లాంటి - మిగతా చివరి పేజీలో

• ఎడిటోరియల్

## బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ కోరాలి

కర్ణాటక ప్రాంతంలో ఎన్డీఏ ప్రభుత్వం అప్పర్ భద్రను జాతీయ ప్రాజెక్టుగా గుర్తించడంతో రాయలసీమ ప్రాంతానికి రాబోయే కాలంలో మరణ శాసనాన్ని లిఖించింది. 2014 విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబు కావచ్చు, ఆ తర్వాత వచ్చిన జగన్మోహన్ రెడ్డి కావచ్చు.. కర్ణాటక, తెలంగాణ అక్రమ ప్రాజెక్టుల గురించి కేంద్రం దగ్గర ఆంధ్రప్రదేశ్ వాదనలు గట్టిగా వినిపించలేకపోయారు. ఫలితంగా తప్పుడు నివేదికలను చూపించి అప్పర్ భద్రకు కర్ణాటక ప్రభుత్వం జాతీయ హోదాను సాధించింది. మరి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి తుంగభద్ర డ్యామ్‌లో దాదాపుగా 33 టీఎంసీలు పూడిక చేరితే దామాసా పద్ధతిన నష్టపోతున్న మన నీటిని సాధించడానికి తుంగభద్ర సమాంతర కాలువను కూడా జాతీయ ప్రాజెక్టుగా చేయవచ్చుగా. అలా చేయాలని కేంద్రం దగ్గర చంద్రబాబు గాని, జగన్ గాని ఇంతవరకు గట్టిగా మాట్లాడలేదు. దీనితో రాయలసీమ ప్రాంతం త్వరలో ఎడారి కాబోతోంది అన్నది రాయలసీమ ఉద్యమకారుల మనోవేదన. ఈరోజు కోస్తా ప్రాంతంలో పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టు చేసింది నాటి యపీఏ ప్రభుత్వం, కర్ణాటకలో అప్పర్ భద్రను జాతీయ ప్రాజెక్టుగా చేసింది నేటి ఎన్డీఏ ప్రభుత్వం. ఈ విషయం ఈ ప్రపంచానికే తెలుసు. కానీ రాయలసీమ ప్రాంతం కరువు ప్రాంతమని మన దేశాన్ని ఏలుతున్న జాతీయ పార్టీల నాయకులకు మాత్రం తెలియదు. గుడ్ ఇయర్‌లో వచ్చే భారీ వర్షాలతో కర్ణాటక ప్రాంతం నుంచి తుంగభద్ర, కృష్ణ నదుల వరద జలాలను రాయలసీమ ప్రాంతానికి మరలించడానికి తుంగభద్ర సమాంతర కాలువ ఆలమట్టి నుంచి బుక్కపట్నం వరకు పశ్చిమ ప్రాంతంలో ఉన్న వేదవతి, పెన్నా, చిత్రావతి, పాపాఘ్ని నదుల వరకు వరద కాలవను జాతీయ ప్రాజెక్టుగా నిర్మించడం అవసరం. అదేవిధంగా సిద్దేశ్వరం దగ్గర కల్వకుర్తి నుంచి తిరుపతికి నిర్మించ తలపెట్టిన నేషనల్ హైవేలో భాగంగా కృష్ణానదిపై కేంద్రం 'తీగల వంతెన' నిర్మిస్తోంది. అక్కడ తీగల వంతెన వద్దు 'బ్రిడ్జ కం బ్యారేజీ' నిర్మించి రాయలసీమ తెలంగాణ ప్రాంతాలకు నీళ్లు గ్రావిటీ ద్వారా గుడ్ ఇయర్లో మరలించగలిగితే అమరావతి విజయవాడ ప్రాంతాలకు ముంపు పరిస్థితులు లేకుండా ప్రమాదాన్ని నివారించవచ్చు. ఈ మేరకు ఎన్నో వేదికల ద్వారా ఢిల్లీ వరకు కూడా రాయలసీమ ఉద్యమకారులు తమ గళాన్ని వినిపించారు. కానీ తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులుగా ఉన్న కేసీఆర్ గానీ, జగన్మోహన్ రెడ్డి గాని, ప్రస్తుతం ముఖ్యమంత్రులు చంద్రబాబు గాని, రేవంత్ రెడ్డి గానీ 'బ్రిడ్జ కం బ్యారేజీ' నిర్మించి మధ్య కోస్తా ప్రాంతంలో వరద ముంపునకు గురవుతున్న విజయవాడ అమరావతి ప్రాంతాలను రక్షించాలని ప్రధాని మోదీని ఏ రోజు కోరడం లేదు. పీకల్లోతు అప్పుల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కృష్ణానది ఒడ్డున సమాధి చేస్తున్నారు. ఈ కరకట్టకు పెట్టే డబ్బులను కృష్ణ, తుంగభద్ర నదుల పైభాగాన ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టి రెండు తెలుగు రాష్ట్రాలు సమన్వయంతో ముందుకు సాగాలి. వరద జలాలను ప్రకాశం బ్యారేజీ వద్ద సముద్రంలోకి వదిలే పరిస్థితి ఉత్పన్నమయ్యేటప్పుడు మాత్రమే రాయలసీమ తెలంగాణ ప్రాంతాలకు నిర్మించబోయే ప్రాజెక్టుల ద్వారా ఒక నిర్దిష్టమైన ప్రణాళిక అంటే తుంగభద్ర సమాంతర కాలువ, బుక్కపట్నం-ఆల్మట్టి వరద కాలువ, గుండ్రేవుల వేదవతి ప్రాజెక్టులు, సిద్దేశ్వరం దగ్గర బ్రిడ్జ కం బ్యారేజీలపై ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలి. దీనికోసం వైకాపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కూడా అసెంబ్లీలో మాట్లాడాలి. ప్రభుత్వాన్ని ఒప్పించాలి. అదేవిధంగా కృష్ణానదికి ముఖద్వారం అయిన రాయలసీమ ప్రాంతంలో కాకుండా కృష్ణానది యాజమాన్య బోర్డును విజయవాడలో పెట్టాలన్న ఆలోచనను విరమించుకోవాలి. శ్రీశైలం ప్రాజెక్టులో 102 టీఎంసీల పూడిక చేరడం వల్ల రాయలసీమ తెలంగాణ ప్రాంతాలకు దక్కాల్సిన నికరజలాలు కూడా కృష్ణార్పణం అవుతున్నాయి. రాయలసీమ ప్రాంతం నుంచి ప్రతి గుడ్ ఇయర్లో 500 టిఎంసిలు, ఎనిమిది వందల టీఎంసీలు వృధాగా సముద్రం పాలు అవుతూనే ఉంది. తుంగభద్ర, కృష్ణా నదుల గట్టున ఉన్న రాయలసీమ ప్రాంత రైతాంగం కర్ణాటకకు, కేరళకు, దుబాయ్‌కి మద్రాస్‌కు, హైదరాబాదుకు వలసలు పోవాల్సిన దుస్థితి ఉంది. ఇప్పటికైనా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాయలసీమ ప్రాంతం విషయంలో తమ పార్టీ విధానాలను మార్చుకొని ఈ ప్రాంతంలో ప్రాజెక్టులు నిర్మించాలి. అదేవిధంగా అభివృద్ధి వికేంద్రీకరణ కోసం రాయలసీమ ప్రాంతంలో హైకోర్టును ఏర్పాటుచేసి, రాయలసీమ ప్రాంతం నుంచి ఏ ఒక్క సంస్థను కూడా ఆ అమరావతికి తరలించకుండా చూడాలి. రాయలసీమ ప్రాంతంలో ఉన్న నిరుద్యోగ యువత ఉద్యోగ కల్పన కోసం విభజన చట్టంలో ఉన్న కడప ఉక్కు పరిశ్రమను వెంటనే నిర్మించేలా కేంద్రం మీద వత్తిడి తీసుకువచ్చేందుకు అసెంబ్లీలో చర్చ జరగాలి. అంతేకాదు విభజన చట్టంలో రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల కోసం బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేక ప్యాకేజీని మంజూరు చేస్తామన్న పార్లమెంటులోని విభజన చట్టం గురించి అసెంబ్లీలో చర్చించాలి. రాయలసీమ ప్రాంతాన్ని ప్రత్యేకంగా అన్ని ప్రాంతాలతో సమాన అభివృద్ధి జరగడానికి రాజకీయ పార్టీలన్నీ కూడా కృషి చేయాలి.

## 'పది' పరీక్షల్లో విద్యార్థులకు అన్ని ఏర్పాట్లు చేయండి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వచ్చే నెలలో రాష్ట్రవ్యాప్తంగా పదోతరగతి వార్షిక పరీక్షలు జరగనున్నాయని, దీనిలో భాగంగా శ్రీకాకుళం జిల్లాలో ఈ పరీక్షల్లో హాజరుకానున్న విద్యార్థులకు బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా ఎటువంటి సంపూర్ణ ఏర్పాట్లు చేస్తున్నారో తెలుసుకునేందుకు జిల్లా విద్యాశాఖ, సర్వశిక్షా అభియాన్ అధికారులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం సోమవారం పట్టణంలోని బి-కాలనీలో గల ఏపీసీ కార్యాలయం సమావేశమందిరంలో మండల విద్యాశాఖాధికారులు, కేజీబీవీ పాఠశాలలు, మోడల్ స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు, ఎస్.ఓలతో భేటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా విద్యాశాఖాధికారి తిరుమలచైతన్య, సర్వశిక్షా అభియాన్ ఏపీసీ ఎస్.శశిభూషణరావులు సారథ్యం వహించారు. ఈ భేటీలో పాల్గొన్న కమిషన్ సభ్యులు సీతారాం జిల్లావ్యాప్తంగా ఈ విద్యా సంవత్సరంలో ఎన్ని పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు, హాజరవుతున్న విద్యార్థుల సంఖ్య ఎంత, వీరిలో బాలికలు, బాలురు ఎంతమంది, ఎన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు కేటాయించారు. వాటిల్లో బాలలహక్కుల పరిరక్షణలో భాగంగా తాగునీటి సదుపాయం, చక్కని వెలుతురు, పరిశుభ్రవంతమైన మరుగుదొడ్లు, ఫ్యాన్లు, సరిపడినన్ని బెంచ్‌లు, కుర్చీలు ఏర్పాటు చేసేలా సంబంధిత పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం ఏర్పాటు చేశారా, పరీక్షలు జరగనున్న కేంద్రాల పరిధిలో విద్యుత్ సమస్యలు లేకుండా, సాంకేతికసమస్యలు తలెత్తకుండా సంబంధిత శాఖాధికారుల దృష్టికి తెచ్చారా, అలాగే మారుమూల ప్రాంతాల్లోని పాఠశాలలకు హాజరయ్యే విద్యార్థులకు రవాణా ఇబ్బందులు లేకుండా సరిపడా బస్‌లు ఏర్పాటు చేసేందుకు ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారా, టౌన్‌లో వివిధ రద్దీ కూడళ్ళలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసుశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చారా, పరీక్షకేంద్రాల్లో ప్రాథమిక వైద్యంతో అనుసంధానంగా ఉండేలా సరిపడా మందులతో మెడికల్‌క్యాంపులు ఏర్పాటు చేసేలా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారితో సంప్రదింపులు జరిపారా, సమస్యాత్మక పరీక్ష కేంద్రాలున్నాయా, వాటిపై ఎటువంటి చర్యలు చేపడుతున్నారు.. తదితర అంశాలపై సుదీర్ఘంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీతారాం మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ, వారి సంక్షేమంలో భాగంగా ఈ వార్షిక పరీక్షల్లో వసతుల లేమి, ట్రాఫిక్ నిబంధనల ఇక్కట్లు, అనారోగ్య సమస్యలు, రోడ్ రవాణా ఇబ్బందులతో ఏ ఒక్క విద్యార్థి పరీక్షలను కోల్పోకుండా పూర్తి ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. ఇప్పటికే తమ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు సారథ్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు ఎస్పీలకు, జిల్లా విద్యాశాఖాధికారులను జాగ్రతపరుస్తూ వివిధ,ఆదేశాలు జారీచేసినట్టు తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుండి 28,934మంది విద్యార్థిని, విద్యార్థులు వివిధ పరీక్ష కేంద్రాల నుండి హాజరవుతున్నారని, వీరిలో. కేజీబీవీల నుండి వెయ్యిమంది హాజరు కాబోతున్నట్టు వివరించారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సూచనలు, ఆదేశాల అమలులో భాగంగా అన్ని పరీక్షకేంద్రాల వద్ద సౌకర్యవంతమైన ఏర్పాట్లు జరిగేలా ప్రణాళికాయుత చర్యలతోపాటు అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో పరీక్షలను విజయవంతం చేస్తామన్న భరోసానిచ్చారు. సర్వశిక్షా అభియాన్ ఏపీసీ శశిభూషణరావు మాట్లాడుతూ అన్ని కేజీబీవీల్లో చక్కని ఉత్తీర్ణత సాధించేలా పాఠశాలలను సందర్శించి తగిన ఏర్పాట్లు సలహాలు, సూచనలు చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి వెంకటరమణ, వివిధ మండలాల ఎం.ఈ.ఓలు, ఎం.వాసుదేవ కుమార్, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అండగా ఉంటాం..అధైర్యపడొద్దు!!

(సత్యంన్యూస్, టెక్కలి)

మండలంలోని చాకిపల్లి గ్రామంలో సోమవారం టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన మాజీ వలంటీర్ జలుమూరు అప్పన్నను వైకాపా టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా దాడికి గల కారణాలను తెలుసుకున్నారు. అనంతరం తిలక్ మాట్లాడుతూ టెక్కలి నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలు పథకం ప్రకారం వైకాపా నాయకులు, కార్యకర్తలు, దళితులపై దాడులకు తెగబడుతున్నారని మండిపడ్డారు. దాడికి పాల్పడిన ఏ ఒక్కరిని విడ్చిపెట్టేది లేదని హెచ్చరించారు. దాడికి గురైన ప్రతీ ఒక్కరికీ అండగా నిలబడి న్యాయపోరాటం చేస్తానని తిలక్ భరోసా ఇచ్చారు. వీరితోపాటు టెక్కలి టెక్కలి మండల నాయకులు సత్తారు సత్యం, మాజీ ఏఎంసీ చైర్మన్ సుగుణమ్మ, సర్పంచులు వాన తవిటయ్య, మొర్రి శంకర్, కోరాడ కామేష్, ఎంపీటీసీ అందరు శ్రీను, సీనియర్ నాయకులు బొల్ల భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు






జిల్లాస్థాయి ఒలింపియాడ్ పరీక్షల్లో ఎస్వీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ ఎల్లంపేట మండలంలో ఎస్వీ పాఠశాల విద్యార్థులు వేదం ఇంటర్నేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఒలింపియాడ్ ఎంట్రన్స్ టెస్ట్ లో 9వ తరగతి స్థాయిలో తనుష్ 8వ స్థాయిలో, 5వ తరగతి స్థాయిలో ధర్మేంద్ర మొదటి స్థానంలో నిలిచినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారికి పాఠశాల ప్రిన్సిపాల్ దంత సుజాత, ఉపాధ్యాయులు, ఠాగూర్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ పెద్దకోట వెంకటరావు తదితరులు అభినందించారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం

హీరోగా.. విలన్‌గా.. క్యారెక్టర్ ఆర్టిస్టుగా బహుముఖ ప్రజ్ఞ చాటిన సీనియర్ నటుడు బ్రహ్మాజీ ప్రధాన పాత్రలో రూపొందిన సినిమా.. బాపు. 'బలగం' తరహాలో తెలంగాణ పల్లెటూరి ముఖచిత్రాన్ని ఆవిష్కరించే సినిమాలా కనిపించింది 'బాపు' ప్రోమోలు చూస్తే. ఈ రోజే ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్ర విశేషాలేంటో చూద్దాం పదండి.

మల్లన్న (బ్రహ్మాజీ) తెలంగాణలోని ఓ పల్లెటూరిలో పేద రైతు. అతడి మీద కుటుంబ బాధ్యతలు చాలా ఉంటాయి. వాటితో పాటు అప్పులనూ మోస్తుంటాడు. పత్తి పంట చేతికి వస్తే అప్పు తీర్చి కుటుంబ అవసరాలు తీర్చుకోవాలని చూస్తున్న తరుణంలో.. వర్షం వల్ల ఆ పంట మొత్తం నాశనం అవుతుంది. అప్పులు తీర్చడానికి పొలం అమ్మడమో.. తాను చావడమో అన్న పరిస్థితి వస్తాడు మల్లన్న. ఈ పరిస్థితుల్లో తమ కష్టాలు తీర్చుకోవడానికి మల్లన్న-అతడి భార్య ఒక ఉపాయం ఆలోచిస్తారు. ఆ ఉపాయం ఏంటి.. దాన్ని వాళ్లు అమలు చేయగలిగారా.. ఇందులో మల్లన్న తండ్రి పాత్ర ఏంటి.. చివరికి ఈ కుటుంబ కష్టాలు తీరాయా లేదా అన్నది మిగతా కథ.




# దారి తప్పిన మంచి ప్రయత్నం!

### కథనం-విశ్లేషణ:

తెలంగాణ పల్లె కథలకు మంచి ఊపు తెచ్చిన చిత్రం.. బలగం. అంతకుముందు కూడా ఇలాంటి మంచి ప్రయత్నాలు కొన్ని జరిగినా.. 'బలగం' తర్వాత వచ్చిన మార్పు వేరు. ఇక్కడి నేటివిటీని హైలైట్ చేస్తూ సహజంగా.. స్వచ్ఛంగా కథలను చెబుతూ ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారు ఫిలిం మేకర్స్. ఐతే చాలా కథలు 'బలగం'ను గుర్తుకు తెస్తున్నాయి కానీ.. 'బలగం'లా మాత్రం పూర్తి స్థాయిలో మెప్పించలేకపోతున్నాయి. గత ఏడాది వచ్చిన 'పొట్టేల్' ఈ కోవలోని చిత్రమే. ఓ మంచి కథను చెప్పాలన్న ప్రయత్నం బాగున్నా.. పకడ్బందీ కథనం కొరవడి ఆ చిత్రం టార్గెట్ ఆడియన్సుని రీచ్ కాలేకపోయింది. ఇప్పుడు 'బాపు' కూడా ఆ వరుసలో నిలిచే చిత్రమే. ఇందులో ప్లాట్ పాయింట్ వింటే భలేగా అనిపిస్తుంది. కథలో ఆ మలుపు దగ్గర ప్రేక్షకులు అమితాసక్తితో చూస్తారు. కానీ ఆ ఐడియాను మొదలుపెట్టడం బాగున్నా.. తర్వాత దాన్ని అంతే ఆసక్తికరంగా ముందుకు తీసుకెళ్లలేకపోయాడు రైటర్ కమ్ డైరెక్టర్ దయ. విరామం దగ్గర భలేగా అనిపించే 'బాపు'.. చివరికి ఒక సగటు చిత్రంలా ముగుస్తుంది. ఓవరాల్‌గా ఈ చిత్రం మిశ్రమా నుభూతిని కలిగిస్తుంది.

ప్రభుత్వం ఇచ్చే పరిహారం కోసం ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కథలు ఒకప్పుడు పత్రికల్లో హైలైట్ అయ్యేవి. ఆ పాయింట్ మీద కాస్త సరదాగా ఓ కథ చెప్పడానికి ప్రయత్నించాడు దర్శకుడు దయ. సమస్యలన్నీ చుట్టుముట్టిన పరిస్థితుల్లో ఆత్మహత్యకు సిద్ధమైన ఓ కుటుంబ పెద్ద.. చావాల్సిన పరిస్థితే వస్తే నువ్వెందుకు చావడం, కుటుంబానికి బరువైన పెద్దాయన చనిపోతే సరిపోతుంది కదా అని చెప్పే భార్య.. అపరాధభావం వెంటాడుతున్నా సరే.. కుటుంబమంతా ఆ మాటకే ఓటు వేసి ఆ ముసలాయన చావు కోసం ఎదురు చూస్తే..? ఇదీ బాపు ప్లాట్ పాయింట్. ఈ కుటుంబం అంతటి దయనీయ స్థితికి ఎందుకొచ్చిందో తెలియజేస్తూ ముందు వారి కష్టాల నేపథ్యంలో కథ నడుస్తుంది. కొన్ని సన్నివేశాలు హృద్యంగానే అనిపిస్తాయి. కాకపోతే రియలిస్టిగ్గా కథను చెప్పే ప్రయత్నంలో దర్శకుడి నరేషన్ మరీ నెమ్మదించింది. కొన్ని సీన్లు బాగున్నా సరే.. కథనం మరీ నత్తనడకన సాగుతున్న భావన కలుగుతుంది. కథలో కీలక మలుపు వచ్చే దగ్గర ప్రేక్షకుల ఆసక్తిని రాబడు తుంది బాపు.

ఐతే ఈ మలుపు తర్వాత కథ ఎలా ముందుకు వెళ్తుంది.. దీనికి ముగింపు ఏంటి అనే క్యూరియాసిటీ ఏర్పడుతుంది కానీ.. దీన్ని దర్శకుడు సరిగా ఉపయోగించుకోలేకపోయాడు. ద్వితీయార్ధంలో కొన్ని సన్నివేశాలు సరదాగా అనిపించినా.. కథనంలో బిగి కనిపించదు. ప్రథమార్ధంలో మాదిరే నరేషన్లో వేగం లేకపోవడం మరో సమస్య. రసవత్తరంగా కథనాన్ని నడిపించడానికి తగ్గ పునాది పడ్డా.. దాన్ని దర్శకుడు ఉపయోగంచుకోలేదనిపిస్తుంది. చాలా వరకు బోర్ కొట్టించే ద్వితీయార్ధం.. బాపు గ్రాఫ్‌ను తగ్గించేస్తుంది. సినిమా ముగింపు కూడా సాధారణంగా అనిపిస్తుంది. ఎమోషన్లు అనుకున్నంత స్థాయిలో పండలేదు. పెద్ద సమస్యకు సింపుల్ గా పరిష్కారం దొరికేయడం.. పెద్దగా డ్రామా ఏమీ లేకపోవడంతో బాపు ఒకింత నిరాశనే మిగులుస్తుంది. ఓ మంచి ఐడియాతో నిజాయితీగా ఓ కథను చెప్పే ప్రయత్నం జరగడం అభినందనీయమే అయినా.. ప్రేక్షకులను ఎంగేజ్ చేసే కథనం మాత్రం ఇందులో కొరవడింది.

– తుపాకి.కామ్ సౌజన్యంతో...

నటీనటులు: బ్రహ్మాజీ నటుడిగా తనలో ఒక కొత్త కోణాన్ని చూపించాడు 'బాపు'లో. ఈ మధ్య ఎక్కువగా కామెడీ క్యారెక్టర్లే చేస్తున్న ఆయన.. సీరియస్ పాత్రలో బాగానే ఒదిగిపోయాడు. తెలం గాణ పల్లెటూరి పేద రైతుగా బ్రహ్మాజీని చూడడం భిన్నంగా అనిపిస్తుంది. తెలంగాణ యాసను ఒడిసిపట్టేశాడు అని చెప్పలేం కానీ.. నాట్ బ్యాడ్ అని మాత్రం చెప్పొచ్చు. ఆమనికి కూడా ఈ పాత్ర కొత్తగానే అనిపిస్తుంది. ఆమె కూడా చక్కగా నటించింది. పేదరికంతో పోరాడుతూ కుటుం బం కోసం తపన పడే భార్యాభర్తలుగా బ్రహ్మాజీ-ఆమని మెప్పించారు. 'బలగం' ఫేమ్ సుధాకర్ రెడ్డి మరోసారి కీలక పాత్రలో ఆకట్టుకున్నాడు. దాదాపుగా బలగం తరహా పాత్రలోనే ఆయన కనిపించాడు. ఆయన ఎక్కడా నటిస్తున్న ఫీలింగ్ కలగదు. అంత సహజంగా కనిపించాడు. అక్కా తమ్ముళ్ల పాత్రల్లో ధన్య బాలకృష్ణన్.. మణి ఏగుర్ల కూడా బాగా చేశారు. ముఖ్యంగా ధన్యను ఇలాంటి పాత్రలో ఊహించలేం. రచ్చ రవి.. మిగతా ఆర్టిస్టులు కూడా బాగానే చేశారు.

సాంకేతిక వర్గం: బాపు సాంకేతికంగా ఓకే అనిపిస్తుంది. ధ్రువన్ సాంగ్స్.. తెలంగాణ పల్లె పాటలను గుర్తు తెస్తాయి. ఈ కథలో ఆ పాటలో బాగానే ఇమిడి పోయాయి. నేపథ్య సంగీతం బాగానే సాగింది. వాసు పెండెం ఛాయాగ్రహణం పర్వాలేదు. సినిమాను పరిమిత బడ్జెట్లో తెరకెక్కించిన విషయం తెరపై కనిపిస్తుంది. ఇండీ సినిమాల లుక్ కనిపిస్తుంది సినిమాలో. రచయిత-దర్శకుడు దయ ఎంచుకున్న పాయింట్ బాగుంది. కానీ కథగా ఇంకా బలం చేకూరాల్సింది. ఆసక్తి కర స్క్రీన్‌ప్లే తోడై ఉంటే బాపు స్పెషల్ మూవీ అయ్యుండేది. తెలంగాణ పల్లెటూరి నేటివిటీని బాగానే చూపించాడు. ఆర్టిస్టుల నుంచి మంచి పెర్ఫామెన్స్ రాబట్టుకున్నాడు.

## పుస్తకాలు, వాటర్ బాటిల్స్ పంపిణీ

(సత్యంన్యూస్, గార)

మండలంలోని లంకపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సిక్కోలు స్వచ్ఛంధ సేవా సమితి సంస్థ సభ్యులు పుస్తకాలు వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. సంస్థ సభ్యులు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో యడ్ల శ్రీనివాసరావు, యడ్ల రాంబాబు, శింతు హరికేశం, శిమ్మ చంద్రశేఖర్, బట్న తరుణ్, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## పేలుడుతో ఇళ్లు బీటలు వారుతున్నాయి

(సత్యంన్యూస్, కొత్తూరు)

కొత్తూరు మండలం ఆకులతంపర గ్రామానికి సమీపంలో ఉన్న క్వారీలో భారీస్థాయిలో పేలుడు పదార్థాలను ఉపయోగించి కొండను పరిమితికి మించి తవ్వుతూ ఉండడం మూలంగా అక్కడికి దగ్గరలో ఉన్న ఆకులతంపరకాలనీ వాసుల ఇల్లు పెద్ద ఎత్తున బీటలువారుతున్నాయి. ఇదివరకు ఎటువంటి వి పునరావృతం జరగని గ్రామస్తులకి, క్వారీ యాజమాన్యంకి మధ్య ఒప్పందం కుదిరినప్పటికి మితిమీరి తవ్వకాలు జరుపుతున్నారు. ఈ విషయంపై స్థానిక తాశీల్దార్‌ను సంప్రదించి దాదాపుగా 10 రోజులు అవుతున్న అటువైపు అధికారులు ఏమాత్రం కూడా చూడడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.





# 'క్యాన్సర్'ను కొనుక్కుంటున్నాం!!

కేంద్ర బడ్జెట్ లో ప్రతి జిల్లాకు ఒక కేన్సర్ ఓ పి సెంటర్‌ను ప్రతిపాదించారు. అంటే దీనిని బట్టి మనం అర్థం చేసుకోవచ్చు... కేన్సర్ అనే వ్యాధి ఎంత ప్రబలంగా మన కుటుంబాల లోనికి చొచ్చుకొని వస్తుందో...దీనికి కొన్ని కారణాలు మన ఊరిలోనే ఉన్నా కానీ మనం మాత్రం పట్టించుకోవడం లేదు.



టీ సెంటర్‌లలో ప్లాస్టిక్ గ్లాస్‌లో వేడివేడి టీ పోసి అమ్ముతున్నారు. మనం ప్లాస్టిక్ గ్లాస్‌లో వద్దు అని కనీసం చెప్పకుండా కొనుక్కుని మరీ త్రాగేస్తున్నాం.. మన ప్రాంతంలోఉన్న కర్రీ పాయింట్‌లలో వేడివేడి కూరలను, సాంబారులాంటి పదార్థాలను ప్లాస్టిక్ కవర్ల లో పోసి మనకు అమ్మేస్తున్నారు. కొన్నిచోట్ల అప్పుడే వండిన వేడి వేడి కూర, సాంబారు లను ప్లాస్టిక్ బకెట్‌లలోకి తీసి పెడుతున్నారు. మన ప్రాంతంలో టిఫిన్ సెంటర్‌లలో వేడివేడి పూరీ కూర, సాంబారు ప్లాస్టిక్ కవర్ లో కడతారు. అరిటాకు లేదా ఇస్తరాకు బదులు ప్లాస్టిక్ పేపర్ వేసి వేడి వేడి ఇడ్లీ, వడలు, గారెలు, బజ్జీలు వేసి పొట్లం కట్టి పార్సెల్ అమ్ముతారు. మరీ ముఖ్యంగా మనం అట్టహాసంగా జరుపుకునే పెళ్లిళ్లకు, వివిధ ఫంక్షన్‌లకు అతిథులను పిలిచి, ప్లాస్టిక్ కవర్ లైనింగ్ ఉన్న ప్లేట్ లలో వేడి వేడి పదార్థాలను వడ్డించి వారికి కూడా కేన్సర్‌ను పరిచయం చేస్తున్నాము. వేడి వేడి పదార్థాలలో ఆ ప్లాస్టిక్ ఎంతో కొంత మిలితమయ్యి, మన శరీరంలోకి ప్రవేశించి, రకరకాల కేన్సర్‌లకు కారణమవుతుంది. అప్పుడు మనం అనుభవించే బాధ భగవంతుడికి కి మాత్రమే అర్థమవుతుంది. విపరీతంగా ప్లాస్టిక్‌ను ఎక్కడ పడితే అక్కడ వాడేసి కాలువల్లో, డ్రైనేజీలో పారావేస్తూ తద్వారా భూగర్భ జలాలు కలుషితం అయి మానవ జీవితానికి పెద్ద దెబ్బ పడుతున్నది. కనీసం చదువుకున్నవాళ్ళు కూడా ప్రశ్నించకుండా డబ్బులిచ్చి మరీ కేన్సర్‌ను కొని తెచ్చుకుంటున్నారు. ఇప్పటికే వివిధ కేన్సర్ హాస్పిటల్‌లకు వెళ్లి కేన్సర్ ట్రీట్మెంట్ ఎన్నో వేళ్ళ మంది చేయించుకుంటున్నారు.

### పేపర్ ప్లేట్స్ వాడకంతో కలిగే హానికర ప్రభావాలు

**పర్యావరణ ప్రభావం:**

**అటవీ నరికివేత:** పేపర్ ప్లేట్స్ ఎక్కువగా వృక్ష జాతుల నుండి తయారు చేయబడతాయి, ఇది అటవీ నాశనానికి దారి తీస్తుంది.

**పునర్వినియోగం & జీవశపరిశ్రమ రహితత:** ప్లాస్టిక్ లేదా మెళుతడి కోటింగ్ ఉన్న ప్లేట్లు రీసైకిల్ చేయడం కష్టమవుతుంది, మరియు అవి పూర్తి స్థాయిలో కుళ్లిపోడానికి చాలా సంవత్సరాలు పడుతుంది.

**తప్పుడు వ్యర్థాలు:** ఒక్కసారిగా ఉపయోగించే ప్లేట్లు చెత్తగా మారి పర్యావరణ కాలుష్యాన్ని పెంచుతాయి.

**ఆరోగ్య సమస్యలు:** రసాయనిక కోటింగ్స్: కొన్ని ప్లేట్లు ప్లాస్టిక్ లేదా ఫోరెవర్ కెమికల్స్ తో పూతపూసినవిగా ఉంటాయి, ఇవి వేడి ఆహారంతో కలిసిపోయే అవకాశం ఉంది.

**మైక్రోప్లాస్టిక్ కలుషితత:** ప్లాస్టిక్ లైనింగ్ ఉన్న ప్లేట్లు చిన్నచిన్న ప్లాస్టిక్ తునకలను ఆహారంలోకి విడుదల చేయవచ్చు.

మరుగుదల, మసకబారిన రసాయనాలు: కొన్ని అలంకారపూరిత ప్లేట్లలో ఉండే రంగులు మరియు రసాయనాలు ఆహారంలో కలిసే ప్రమాదం ఉంది.

### పరిరక్షణ కోసం ఉత్తమ ప్రత్యామ్నాయాలు:


కంపోస్టబుల్ ప్లేట్లు: బాంబూ, చెరకు పప్పు (బ్యాగాస్) వంటి సహజ పదార్థాలతో తయారైనవి.

**తిరిగి ఉపయోగించుకునే ప్లేట్లు:** సిరామిక్, గాజు, లేదా స్టెయిన్‌లెస్ స్టీల్ ఆరోగ్యానికి మరియు పర్యావరణానికి మంచివి.

**జీవపరిరక్షణతో కూడిన ఎంపికలు:** కొన్నివరకు అనారోగ్యకరమైన కోటింగ్ లేని పేపర్ ప్లేట్లు త్వరగా కుళ్లిపోతాయి. పర్యావరణానికి హానికరం కాదు. తద్వారా, పేపర్ ప్లేట్లను తప్పనిసరి అయితే మాత్రమే వాడాలి. సహజమైన, పునర్వినియోగపరచుకునే లేదా కంపోస్టబుల్ ఎంపికలను ఎంచుకోవడం మంచిది.

ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీగా రఘువర్మను గెలిపించాలని కోరుతూ మండలంలో పలు కాలేజీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను జనసేన పార్టీ ఎచ్చెర్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ విశ్వక్షేన్ కలిసి ఓటును అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు బెందు మల్లేశ్వరరావు, జనసేన అధ్యక్షులు తమ్మినేని శ్రీను గారు, చౌదరి అవినాష్, మాడుగుల శ్రీను తదితరులున్నారు.

**- సత్యంన్యూస్, ఎచ్చెర్ల**





మండలంలోని జొన్నాం గ్రామంలో గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న బోర శ్రీరామ్మూర్తిని వైకాపా యువ నాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య మంగళవారం పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరావు, ఎంపీపీ ముద్దాడ బైరాగి నాయుడు, మండల అధ్యక్షులు కణితి కృష్ణారావు, ఎంపీటీసీ బావన వైకుంతరావు, సర్పంచ్ యెన్ని వెంకటేష్, సోమరాజు పాపారావు తదితరులు పాల్గొన్నారు.

**- సత్యంన్యూస్, పోలాకి**

## నాణ్యమైన విద్య భవిష్యత్తుకు మార్గదర్శకం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలోని గార మండలం కళింగపట్నం లిటిల్ స్టార్ స్కూల్ లో ఫేర్వెల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతి శంకర్ హాజరయ్యారు. పాఠశాల కస్పాండెంట్ ప్రసాదరావు ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమంలో పాల్గొని నాణ్యమైన విద్య పిల్లల భవిష్యత్తు ముఖ్య భూమిక పాఠశాల వహిస్తుందని క్రమశిక్షణ ఉత్తమ విద్యని అందిస్తుందని స్వాతి శంకర్ తెలిపారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, ఆకాంక్షిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు.



## బోయినకు ఎమ్మెల్సీ ఇవ్వాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్ర కళింగకోమటి సంఘ అధ్యక్షులు బోయిన గోవిందరాజులుకు ఎమ్మెల్సీ కోటాలో శాసనమండలి సభ్యునిగా నియమించాలని టీడీపీ వ్యవస్థాపక కార్యకర్త పీవీ రమణ కోరారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి రావడానికి కళింగకోమట్ల తరుపున ఆయన విశేష కృషి చేశారన్నారు. కళింగకోమట్లు అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ రాజకీయంగా సరైన ప్రాధాన్యతకు నోచుకోవడం లేదన్నారు. ఎన్నికల సమయంలో కళింగకోమట్లకు చట్టసభల్లో స్థానం కల్పిస్తామని ముఖ్యమంత్రి, జిల్లా మంత్రి హామీ ఇచ్చారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం ఖాళీ అవుతున్న ఎమ్మెల్సీ స్థానాల్లో కళింగకోమటి సామాజికవర్గానికి చెందిన బోయిన గోవిందరాజులకు అవకాశం కల్పించాలని కోరారు.

పేపర్ బాయ్స్
కావలెను
సంచలన సాయంకాల పత్రిక సత్యం'లో పని చేసేందుకు పేపర్‌బాయ్స్ కావలెను.
- సంప్రదించండి -
94414 66455

## ఘనంగా జేసీఐ శ్రీకాకుళం సన్‌రైజర్స్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నిరంతర సేవా కార్యక్రమాలతో జేసీఐ శ్రీకాకుళం సన్‌రైజర్స్ ముందుకువెళ్ళాలని జోన్-4 అధ్యక్షులు సంతోష్ శివకుమార్, ఏపీఎస్పీపీసీఆర్ సభ్యులు గొండు సీతారాం, జేసీ చంద్రశేఖర్ సోమవారం అన్నారు. స్థానిక ఎస్వీయే గ్రాండ్‌లో జూనియర్ చాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ శ్రీకాకుళం సన్‌రైజర్స్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జోన్ ఫోర్ ప్రెసిడెంట్ ఏ.సంతోష్ శివకుమార్, వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, వైస్ చైర్మన్ నటుకుల మోహన్, సెనెటర్ డా.వినోద్‌కుమార్, పూర్వపు అధ్యక్షులు బగాది ప్రవీణ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిధులుగా పాల్గొన్న ఏపీఎస్పీపీసీఆర్ సభ్యులు గొండు సీతారాం మాట్లాడుతూ జేసీఐ గత నలభై ఏళ్ళుగా అంటే సంస్థ ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటి వరకు శ్రీకాకుళంలో జేసీఐ చేపట్టిన కార్యక్రమాలను విన్నానని, అందుకు ఆనందంగా ఉందని, జేసీఐ సేవలు కొనసాగాలన్నారు. మంచి నిర్ణయాలతో ముదుకువెళ్తున్న జేసీఐ సన్‌రైజర్స్ ఎక్కువగా యువతకు ఉపయోగపడే కార్యక్రమాలపై దృష్టి సారిస్తే అదే యువత మంచి నాయకునిగా తయారై సమాజానికి ఉపయోగపడతారన్నారు. నూతన అధ్యక్షులు సింగూరు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ జెసీఐతో నాయకత్వ లక్షణాలు మెండని, యువతకు దిశానిర్దేశం చేస్తూ క్రమశిక్షణతో కూడిన నాయకులని తయారుచేయడంలో జేసీఐ ముందుంటుందని, జేసీఐ సన్‌రైజర్స్ సేవలను ప్రజలకు, ముఖ్యంగా యువతకు చేరువ చేస్తామన్నారు. జెసీఐ సేవా కార్యక్రమాలతోపాటు, వెయ్యి యూనిట్ల రక్తసేకరణతో రక్త కొరతలేని శ్రీకాకుళంలో భాగమవుతామన్నారు. విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని వారికి ఉపయోగపడే కార్యక్రమాలతో, తమ నూతన కార్యవర్గ సూచనలతో అందరినీ కలుపుకుంటూ ముందుకువెళ్తామన్నారు. అనంతరం జేసీఐ శ్రీకాకుళం నూతన అధ్యక్షునిగా సింగూరు ప్రవీణ్ కుమార్, కార్యదర్శిగా పి.సుదర్శన్, కోశాధికారిగా ఐతం వెంకటేష్, ఉపాధ్యక్షులుగా వై.జగదీశ్, ఎం.షర్మిల, కె.భూపతినాయుడు, పి.దామోదర్, జైబాబా, డైరెక్టర్లుగా కె. సురేష్, శ్రీనివాసరావు, కె.పవన్, ఎం.వి. రమణ, కోటేశ్వరరావు, సత్యనారాయణ, వ్యవస్థపాక అధ్యక్షులు దూసి సంతోష్ తదితరులు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో విశాఖపట్నం జేసీఐ అధ్యక్షులు, సభ్యులు, శ్రీకాకుళం జేసీఐ మెయిన్ సభ్యులు, జెసిఐ గ్రీన్ సిటీ పూర్వపు అధ్యక్షురాలు మణిశర్మ, ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, నగరప్రముఖులు తదితరులు పాల్గొన్నారు .



# ఎమ్మెల్సీగా రఘువర్మను గెలిపించండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గానికి జరగబోతున్న ఎన్నికలకు పోటీ చేస్తున్న సిట్టింగ్ శాసనమండలి సభ్యులు, పాకలపాటి రఘువర్మకు ప్రథమ ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ, శ్రీకాకుళం జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిసిని వసంతరావు, కూన రంగనాయకులు ఓ ప్రకటనలో కోరారు. ఈమేరకు ఇంటింటి ప్రచారంలో ఉపాధ్యాయులను కలిసి ఓట్లు అభ్యర్థిస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(257) అభ్యర్థిగా అధికార కూటమి పార్టీలు తెదేపా, జనసేన సహా మెజారిటీ సంఘాలు పాకలపాటి రఘువర్మకు మద్దతు పలుకుతున్నాయన్నారు. ఉపాధ్యాయులందరినీ ఏకతాటి పైకి తెచ్చి, కలుపుకుని పోయే మనస్తత్వం కలిగిన వ్యక్తిగా ఆయన్ను నమ్ముతున్నట్లు చెప్పారు. తన పదవీకాలంలో ఏర్పడ్డ విపత్కర కోవిడ్ సమయాల్లోనూ, తదనంతర పరిణామాలలోను మొక్కవోని ధైర్యంతో శాసనమండలిసభ్యునిగా తన కర్తవ్యాలను చిత్తశుద్ధితో నిర్వహించారన్నారు. శ్రీకాకుళం జిలాలో 42మంది డీఎస్సీ హిందీ భాషా పండితులకు జీతాలు చెల్లింపులో జరిగిన తీవ్ర జాప్యాన్ని ఆయన శాసనమండలిలో ప్రశ్నించారన్నారు. భాషోపాధ్యాయులు ఎదుర్కొంటున్న డీఈవో పూల్ సమస్య సహా పలు సమస్యల పట్ల అవగాహన, సానుకూల దృక్పథాలు కలిగివున్న రఘువర్మను మండలికి పంపాలని కోరారు. ఈ క్రమంలోనే రాష్ట్ర కార్యవర్గ సమష్టి నిర్ణయం మేరకు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాకలపాటి రఘువర్మ విజయానికి కలసి రావాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పట్నాల వెంకటరమణ, రాష్ట్ర కార్యదర్శి పూడి లక్ష్మీపతి, రఘుపాత్రుని శ్రీనివాసరావు, కుప్పన్న గారి శ్రీనివాసరావు, టేకి బాబురావు, గొడబ మేరీ ప్రసాద్,చింతపల్లి జనార్ధనరావు, అరసవల్లి గణపతి రావు, గండ్రేటి వినయ్ కుమార్, బండారు రామచంద్రరావు, పట్నాన కృష్ణారావు, సింహాద్రి ఫల్గుణరావు, గంటి మీనాకుమారి, తోట పద్మజ, బాడాన మంజుల, రాడ సంధ్యారాణి, బెండి కళ్యాణి, జువ్వాది పద్మలత, మజ్జి వెంకటరమణ, రొంపివలస రామారావు, కింతలి రవిశంకర్, లోలుగు వెంకటరమణ, రుప్ప తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.



డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

భాస్కర టూర్స్ & ట్రావెల్స్
ఆన్‌లైన్ వర్క్స్
ఇ-రిజర్వేషన్, బస్ టిక్కెట్స్, వాల్వో ఎ/సి, నాన్ ఎ/సి, రైల్వే ఫ్లైట్ టిక్కెట్స్ మొదలైనవి చేయబడును.
ఆర్ట్స్ కాలేజ్ రోడ్, అంబేద్కర్ జంక్షన్ దగ్గర, శ్రీకాకుళం.
సెల్: 77320 63656, 80967 20076
btsrikakulam@gmail.com

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE WOMEN'S COLLEGE ROAD, SRIKAKULAM - 532 001

## అభివృద్ధి పేరుతో పేదల ఇళ్లు దోచుకుంటే
# సహించేది లేదు



(సత్యంన్యూస్, పలాస)

కూటమి ప్రభుత్వం అభివృద్ధి పేరుతో పేదల ఇళ్లు దోచుకుంటున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ ఆరోపించారు. కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని సూదికొండ ప్రాంతంలో దాదాపు 9 ఎకరాల భూమిలో పేద, మధ్యతరగతి ప్రజలు 40 ఇళ్లు కట్టుకుని జీవనాన్ని సాగిస్తున్నారని, ప్రభుత్వం ఈ ప్రాంతంలో సెంట్రల్ స్కూల్ మంజూరు చేసినట్లు వారం రోజుల ముందు నోటీసులు తయారుచేసి బుల్డోజర్ సహాయంతో ఇళ్లను కూల్చి నేలమట్టం చేశారన్నారు. కనీసం ప్రజలతో సంప్రదించకుండా, వాస్తవ పరిస్థితులు తెలుసుకోకుండా ప్రభుత్వం ఈ విధంగా చేయడం సమంజసం కాదని, ఇళ్లు కోల్పోయిన పేద, మధ్య తరగతి ప్రజలు రోడ్డున పడిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత 40 ఏళ్లుగా ఈ ప్రాంతంలో ఉంటున్న ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన అధికారులు, స్థానిక ఎమ్మెల్యే ప్రజలను కూర్చోబెట్టి మాట్లాడాలని, అదేవిధంగా సెంట్రల్ స్కూల్ తెచ్చి అభివృద్ధి చేస్తారంటే భారత కమ్యూనిస్టు పార్టీగా మేము స్వాగతిస్తున్నామని, పేద ప్రజలు నివాసముంటున్న భూములే అవసరమయ్యాయా అని ప్రశ్నించారు. గతంలో వైకాపా, ఇప్పుడు తెలుగుదేశం బడాబాబుల జోలికి పోకుండా పేదలు నివసిస్తున్న స్థలాల వద్దకు వచ్చి బుల్డోజర్ రాజకీయాలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఎమ్మెల్యే అసెంబ్లీ నుంచి రాగానే ప్రజలతో సంప్రదించి ఈ స్థలం పరిశీలన చేసి పేదలు నివసించే స్థలంలో సెంట్రల్‌స్కూల్ పెడితే ప్రత్యామ్నాయంగా ఇక్కడ నివసిస్తున్న ప్రజలకు నష్టపరిహారం, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, లేనిపక్షంలో పోరాటం తప్పదన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సీహెచ్ వేణుగోపాల్, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు గోపి, కుమార్, బాధితులు దాసరి రాజు, సంధ్య, రమ తదితరులు పాల్గొన్నారు.






# బ్యాంక్ సిబ్బంది సహకారంతోనే..

(మొదటిపేజీ తరువాయి)

ఉదంతాల్లో ప్రాథమికంగా తక్కువ మొత్తాల్లో లాభాలు చూపించి రూ.కోట్లల్లో కొట్టేస్తున్నారు. నేరం జరిగాక సకాలంలో బ్యాంకు ఖాతాలు స్తంభింపజేసి డబ్బు ఇతర ఖాతాల్లోకి బదిలీ కాకుండా చూడడం, ఆ తర్వాత తగిన సాక్ష్యాధారాలు సేకరించి న్యాయ ప్రక్రియ పూర్తిచేసి బాధితులకు డబ్బు తిరిగిఅప్పగించడం సుదీర్ఘ ప్రక్రియ. ఈ సవాళ్లను దృష్టిలో ఉంచుకుని అసలు నేరాలు జరగకుండా జాగ్రత్తపడేలా ప్రజల్లో అవగాహన కలిగేలా ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారు. అయితే సైబర్ నేరగాళ్లు అనేక రీతులలో వల విసురుతూనే ఉన్నారు. పోలీసు, సీబీఐ. ఆదాయపు పన్ను శాఖ అధికారుల పేరుతో కూడా బెదిరింపులకు పాల్పడుతున్నారు. వీటి నియంత్రణకు ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా బాధితులు పెరుగుతున్నారే గాని క్రైంరేటు తగ్గడం లేదు. నేషనల్ క్రైమ్ రికార్డుల బ్యూరో ప్రకారం గత ఏడాది 11 లక్షల పైగా సైబర్ ఫ్రాడ్ కేసులు నమోదయ్యాయి. పోలీసుల దృష్టికి రాని కేసులు కూడా వేలు, లక్షల సంఖ్యలోనే ఉంటున్నాయి.

### తెలంగాణలో సైబర్ నేరాల సగటు పెరుగుదల 10-15 శాతం

గత మూడేళ్ల గణాంకాలు పరిశీలిస్తే రాజధానిలో సగటున 9 నుంచి 10 వేల మధ్య ఇళ్లల్లో దొంగతనాలు, వాహన, సెల్‌ఫోన్ చోరీలు రికార్డు కాగా, సైబర్ నేరాల సగటు పెరుగుదల 10-15 శాతం కంటే ఎక్కువగా ఉంటోంది. బాధితులు పోగొట్టుకునే సొత్తు రూ. వందల కోట్లలో ఉంటోంది. ఒక్క 2023లోనే హైదరాబాద్‌లోని మూడు కమిషనరేట్లలో కలిపి సుమారు రూ.450 కోట్లు పోగొట్టుకున్నట్లు అధికారులు వెల్లడించారు. అయితే దొంగతనాలు, చైన్ స్నాచింగ్ తదితర కేసుల్లో కాజేసిన సొత్తు రికవరీ చేసేందుకు ఎక్కువ అవకాశాలుంటాయి. నిందితుల ప్రమేయం నేరుగా ఉండడం. సీసీ ఫుటేజీలు, వేలిముద్రలు, ఇతర సాంకేతిక ఆధారాలతో తేలిగ్గా చిక్కుతారు. అయితే సైబర్ నేరాలు ఎక్కడ నుంచి జరుగుతున్నాయో కూడా తెలువదు. సైబర్ నేరాల్లో రికవరీ రేటు మాత్రం సరాసరి 5 శాతం కూడా ఉండడం లేదు. నిందితులు కటకటాలు లెక్కించడమూ కష్టసాధ్యంగా మారుతోంది.

ఉదాహరణకు హైదరాబాద్ కమిషనరేట్‌లో గత ఏడాది చోరీ కేసుల్లో మొత్తం రూ.38.38 కోట్లు సొత్తు కాజేయగా, పోలీసులు రూ.28.45 కోట్లు రికవరీ చేశారు. అంటే రికవరీ రేటు 74.15శాతం. అదే సైబర్ నేరాల్లో రికవరీ సమస్యగా మారుతోంది. సైబర్ క్రైమ్ పోలీసుల అంచనా ప్రకారం తెలంగాణలోనే ప్రజలు సైబర్ నేరాల బారినపడి రోజూ సగటున రూ.3కోట్లకు పైనే పోగొట్టుకుంటున్నారు. వాస్తవానికి సైబర్ నేరగాళ్ల కొల్లగొట్టే సొమ్ము ఇంతకు 10 రెట్ల కంటే ఎక్కువగా ఉంటుందని కూడా పోలీసులు అంటున్నారు. ఒక్క హైదరాబాద్‌లోనే రోజుకు రూ.కోటికి పైగా సైబర్ నేరగాళ్ల ఖాతాల్లోకి వెళ్తున్నాయి.

### ఏపీలోనూ పెరిగిన సైబర్ నేరాలు

ఆంధ్రప్రదేశ్‌లో గత మూడేళ్లలో సైబర్ నేరగాళ్లు రూ.940 కోట్లు కొల్లగొట్టినట్లు సైబర్ క్రైం పోలీసుల లెక్కలు చెబుతున్నాయి. వెంటనే స్పందించిన కేసుల్లో పోలీసులు రూ.8.26కోట్లే తిరిగి రాబట్టగలిగారు. అంటే రికవరీ కేవలం 0.87 శాతమే. మరో రూ.140.40 కోట్లు బ్యాంకుల్లో ఫ్రీజ్ చేయించారు. నేరగాళ్లు వేర్వేరు దేశాలు, వివిధ ప్రాంతాల్లో ఉంటూ మోసాలకు తెగబడుతుండటంతో వారిని పట్టుకోవటడం, సొమ్మును రికవరీ చేయటం పోలీసులకు పెద్ద సవాల్‌గా మారుతోంది. సైబర్ నేరాల సంఖ్య కూడా విపరీతంగా పెరిగిపోయింది. 2014-18 మధ్య ఏపీలో 3,572 సైబర్ నేరాలు నమోదు కాగా, 2019-23 మధ్య 9,849 కేసులు నమోదయ్యాయని పోలీసులు తెలిపారు. గడచిన సంవత్సరంలోనూ సైబర్ నేరాలు భారీగానే నమోదయ్యాయి.

### కొత్త పద్ధతులలో సైబర్ నేరాలు

కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో నమోదైన ఫిర్యాదులను విశ్లేషించినప్పుడు అనేక రకాల నేరాలు వెలుగులోకి వచ్చాయి. అందులో కస్టమర్ సర్వీసు స్కామ్, వర్చువల్ అరెస్టుస్కామ్ ఎక్కువగా జరిగినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఉత్తర భారతదేశంలో అనేక మంది వర్చువల్ అరెస్టు స్కామ్ బారిన పడుతున్నారు. ఆధార్ కార్డును హ్యాక్ చేసి మోసాలకు పాల్పడేవారు ఇటీవల పెరిగారు. ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టమ్ ద్వారా బాధితుడి బయోమెట్రిక్ సమాచారాన్ని హ్యాక్ చేసి మోసాలకు పాల్పడుతున్నారు. మరోవైపు సోషల్ మీడియాను ఉపయోగించి చేసే మోసాలు పెరిగాయి.

### సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఉద్యోగుల సహకారం

కేంద్ర హోంశాఖను సైబర్ ఇంటిలిజెన్స్ అందించిన నివేదికకు బలం చేకూర్చే కేసులను ఇటీవల తెలంగాణ పోలీసులు వెలుగులోకి తెచ్చారు. సైబర్ నేరగాళ్ల ఆగడాలకు కొందరు బ్యాంకు ఉద్యోగులు దన్నుగా ఉంటున్నారు. ఖాతా వివరాలు అడిగో, ఓటీపీ నంబరు అడిగో, లేదంటే డిజిటల్ అరెస్టు అయ్యారని భయపెట్టో అమాయక ప్రజలను మోసం చేసి.. వారి నుంచి కోట్లు కొల్లగొడుతున్న సైబర్ నేరగాళ్లకు ఆ ఉద్యోగులే సహకరిస్తున్నారు. సైబర్ నేరగాళ్ల కోసం మ్యూల్ ఖాతాలను సృష్టించి ఆ దొంగ డబ్బు దాచుకునేలా వేర్వేరు ఖాతాలకు బదిలీ చేయించుకునేలా అన్ని విధాలుగా సహకరిస్తున్నారు.

తెలుగు రాష్ట్రాలు సహా గుజరాత్, కర్ణాటక, న్యూఢిల్లీ, యూపీ, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, బిహార్‌లో సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు భారీ ఆపరేషన్ నిర్వహించి 52 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టుచేశారు. దీంతో బ్యాంకు ఉద్యోగుల సహకారం తేటతెల్లమైంది. ఈ సైబర్ నేరగాళ్లు తెలంగాణలో 74 సైబర్ నేరాలు సహా దేశవ్యాప్తంగా 576 నేరాలకు పాల్పడి రూ.88.32 కోట్లు కొల్లగొట్టారని పోలీసులు తేల్చారు. ఒక్క హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోనే 33 సైబర్ నేరాలకు పాల్పడ్డారు. ఈ కేసుల దర్యాప్తులో సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న వేర్వేరు బ్యాంకులకు చెందిన నలుగురు ఉద్యోగులను అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు. ఈ నలుగురు నేపాల్, చైనాల్లోని ప్రధాన సైబర్ క్రిమినల్స్ ఖాతాలకు రూ.23కోట్లు తరలించినట్లు, దేశవ్యాప్తంగా 20 కేసుల్లో వీరి పాత్ర ఉన్నట్లు తేలింది. సైబర్ క్రిమినల్స్ వద్ద రూ.47.90 లక్షల నగదు, మరో రూ.40 లక్షల విలువైన క్రిప్టో కరెన్సీ కలిపి మొత్తం రూ. 87.90 లక్షలను స్వాధీనం చేసుకున్నామని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ వెల్లడించారు. నేరస్థుల ఖాతాల్లో రూ.2.87 కోట్లు ఫ్రీజ్ చేశామన్నారు.

సైబర్ నేరగాళ్లకు ప్రత్యక్షంగాను పరోక్షంగానూ కొందరు బ్యాంకు ఉద్యోగులు సహకరిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలడంతో సైబర్ సెక్యూరిటీ బ్యూరో బ్యాంకర్లకు కొన్ని సూచనలు చేసింది. సైబర్ క్రైం కేసుల్లో బ్యాంకు సిబ్బంది పాత్ర ఏ మాత్రం ఉన్నా అరెస్టులు తప్పవని హెచ్చరించింది. పెద్ద మొత్తంలో డబ్బు జమ చేసే వీలున్న కరెంటు ఖాతాల రూపంలోనే మ్యూల్ ఖాతాలు తెరుస్తున్నారు. ఏదైనా బ్యాంకులో కరెంట్ ఖాతా తెరవాలంటే జీఎస్టీఎన్ నంబర్, కంపెనీ అయితే రిజిస్టర్ ఆఫ్ కంపెనీస్ నంబర్ తప్పనిసరి. అయితే డబ్బులకు కక్కుర్తిపడి వీటన్నింటినీ బ్యాంకు ఉద్యోగులు మేనేజ్ చేస్తున్నారు. ఇప్పటి వరకు సైబర్ ఫ్రాడ్స్‌లో బయటపడ్డ ఖాతాల్లో చాలావరకు బ్యాంక్ సిబ్బంది సహకారంతోనే ఫేక్ ఖాతాలు ఓపెన్ అయినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఏదైనా ప్రజలు అప్రమత్తంగా ఉండటం, బ్యాంకులలో పనిచేసే కాంట్రాక్టు సిబ్బంది, థర్డ్ పార్టీ సంస్థల విషయంలో బ్యాంకు ఉన్నతాధికారులు కన్నేసి వుంచడం ద్వారా నేరాలను అరికట్టవచ్చు. ముఖ్యంగా ప్రైవేటు బ్యాంకుల విషయంలోనూ ఆర్బీఐ కఠిన చర్యలు చేపట్టాల్సివుంది.

# బెట్టింగ్ కోసం.. పింఛను సొమ్ము స్వాహా

మొదటిపేజీ తరువాయి

రెండు రోజులుగా తన కొడుకు ఇంటికి రావడం లేదని చెప్పినట్టు తెలిసింది. ఆసుపత్రిలో చేర్చి వైద్యం చేయించినట్టు భానుప్రతాప్ చెప్పిన మాట అబద్ధమని ఆయన తల్లి చెప్పడంతో పింఛను సొమ్ముతో పరారైనట్టు తేలింది. ఈ నెల 3న భానుప్రతాప్‌కు రూ.33వేలు జీతం ప్రభుత్వం జమ చేసింది. అప్పటికే తల్లి వైద్యం కోసం రూ.49వేలు ఖర్చు చేసినట్టు చెప్పడంతో జీతం సొమ్మును వెనక్కి ఇచ్చేయాలని సచివాలయ సిబ్బంది కోరినట్టు తెలిసింది. ఆ తర్వాత ఫోన్ స్విచాఫ్ చేయడంతో భానుప్రతాప్ ఎక్కడ ఉన్నాడో ఆచూకీ లేకపోవడంతో పింఛన్ సొమ్ముతో పరారైనట్టు ఈ నెల ఆరో తేదీకే సచివాలయ సిబ్బంది రూఢీ చేసుకున్నారు. 11 మంది లబ్ధిదారులకు సచివాలయ పరిధిలో వినియోగదారుల నుంచి వసూలుచేసిన ఇంటి పన్ను మొత్తం రూ.30వేలుతో కలిపి సిబ్బంది తలా కొంత వేసుకొని ఈ నెల ఐదునే పింఛను సొమ్ము చెల్లించేశారు. నాలుగు రోజులుగా ఆచూకీ లేకపోవడంతో భానుప్రతాప్ తల్లి జిల్లా సర్వేశాఖ కార్యాలయంలో ఏడీని కలిసినట్టు తెలిసింది. దీనిపై ఏడీ స్పందిస్తూ ఒకటో తేదీ నుంచి విధులకు హాజరు కావడం లేదని, డిప్యూటీ సర్వేయర్‌తో విచారణ చేయించి చర్యలు తీసుకుంటానని భానుప్రతాప్ తల్లికి, సచివాలయం సిబ్బందికి తెలిపినట్టు తెలిసింది.

### బదిలీల ఆర్డర్లు తయారు బాధ్యత

సర్వేయర్ భానుప్రతాప్‌కు ఆన్‌లైన్‌లో రమ్మీ ఆడడం, బెట్టింగ్ వేసే అలవాటు ఉందని సహోద్యోగులు చెబుతున్నారు. మూడేళ్లుగా సర్వేయర్‌గా ఉద్యోగం చేస్తున్నా ఇంటికి ఒక్క పైసా ఇవ్వలేదని భానుప్రతాప్ తల్లి సచివాలయ ఉద్యోగుల వద్ద బోరున విలపించినట్టు చెబుతున్నారు. బ్యాంకు నుంచి హౌసింగ్ లోన్ రూ.7లక్షలు వాడుకున్నా ఒక్క రూపాయి ఇంటి కింద ఖర్చు చేయలేదని భానుప్రతాప్ తల్లి సచివాలయ సిబ్బందికి చెప్పినట్టు తెలిసింది. భానుప్రతాప్‌కు డెప్యూటేషన్‌పై జిల్లా కార్యాలయంలో బాధ్యతలు అప్పగించిన శాఖాధికారి ఆయనతో అనేక అక్రమాలు చేయించినట్టు ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని శాఖల్లో సచివాలయ ఉద్యోగుల బదిలీలు పూర్తి అయిన తర్వాత గత ఏడాది ఆగస్టు 23న మొదటి బదిలీ ఉత్తర్వును ఇచ్చారు. ఆ తర్వాత ఈ ప్రక్రియ సుదీర్ఘకాలం అంటే ఈ ఏడాది జనవరి వరకు సాగింది. ఆ సమయంలో బదిలీ ఆర్డర్లను తయారుచేసే బాధ్యతను సర్వేశాఖ ఏడీ భానుప్రతాప్‌కు అప్పగించారు. బదిలీలు నిర్వహించినన్ని రోజులు ఏడీ కారులోనే ల్యాప్‌టాప్ పట్టుకొని భానుప్రతాప్ తిరిగేవాడని ఉద్యోగులు చెబుతున్నారు. దీంతో ప్రతి ఆర్డర్‌కు కొంత మొత్తం వసూలు చేసినట్టు ఆరోపణలున్నాయి. ఏడీ పేరు చెప్పి బదిలీ అయిన సర్వేయర్ల నుంచి వసూలుచేస్తున్న విషయం సదరు అధికారికి కొందరు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో ఏడీకి తెలిసే జరుగుతుందన్న విమర్శలున్నాయి. సచివాలయ సర్వేయర్లకు సంబంధించిన బదిలీ ఉత్తర్వులన్నీ భానుప్రతాప్ ద్వారా వస్తుండడంతో అందరూ ఆయన్నే ఆశ్రయించారు. దీంతో ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు ఉన్నా, లేకున్నా బదిలీ ఆయన ప్రతి సర్వేయర్ నుంచి రూ.10వేలు నుంచి రూ.60 వేలు చొప్పున సుమారు రూ.10 లక్షలు వసూలు చేశారని విశ్వసనీయ సమాచారం.

### బదిలీల పేరుతో వసూలు

ఈ క్రమంలోనే ఏడీకి తెలియకుండా కొందరికి బదిలీ ఉత్తర్వులు ఇచ్చి డబ్బులు వసూలు చేశారని విమర్శలున్నాయి. కొందరి నుంచి లక్ష రూపాయిలు వసూలు చేశారని ఆరోపణలు ఉన్నాయి. బదిలీ ప్రక్రియ రోజుల వ్యవధిలో పూర్తి కావాల్సివున్నా నాలుగు నెలల పాటు నిర్వహించడం వల్ల భానుప్రతాప్ కొందరికి బదిలీ ఉత్తర్వులు వాట్సాప్‌లో పంపించి ఏడీ డబ్బులు ఆశిస్తున్నారని చెబుతుండేవాడు. డబ్బులు ఇస్తే బదిలీ ఉత్తర్వులు పైన ఏడీ సంతకం చేయించి పంపిస్తానంటూ నమ్మించేవాడు. ఈ తతంగం ఏడీకి తెలిసే జరిగేదని ఉద్యోగుల్లో చర్చ సాగుతుంది. కొందరు సర్వే ఉద్యోగులు భానుప్రతాప్‌కు ఫోన్ చేస్తే తీసుకున్న సొమ్ములన్నీ ఏడీకే ఇచ్చేస్తున్నానని చెబుతుండేవాడని ఉద్యోగుల్లో ఒక చర్చ సాగింది. అందులో భాగంగానే ఎచ్చెర్ల మండలం ఎస్ఎం పురం సచివాలయానికి బదిలీ చేయిస్తానని చెప్పి ఒకరికి తెలియకుండా మరొకరికి వేర్వేరుగా బదిలీ ఉత్తర్వులు ఇచ్చి వారి నుంచి రూ.10 వేలు చొప్పున ఇద్దరి నుంచి రూ.20వేలు వసూలు చేశారు. ఆ తర్వాత వారిద్దరూ మోసపోయామని గ్రహించి ఏడీని ఆశ్రయించినా తనకు సంబంధం లేదని చేతులెత్తేశారు తప్ప భానుప్రతాప్‌పై చర్యలు తీసుకోలేదు. అదే అదనుగా భానుప్రతాప్ బదిలీ అయిన సచివాలయం సర్వేయర్లు ఎవరినీ విడిచిపెట్టలేదని తెలిసింది. ఏడీ కార్యాలయంలో పని చేస్తున్న ఒక మహిళా ఉద్యోగి నుంచి రూ.60 వేలు వసూలు చేసినట్టు తెలిసింది. సదరు ఉద్యోగి కంచిలి నుంచి జిల్లా కార్యాలయంలో పని చేస్తుండగా ఆగస్టులో నిర్వహించిన బదిలీల్లో తిరిగి కంచిలికి బదిలీ అయింది. దీనితో ఆమె బదిలీ నిలుపుదల చేయిస్తానని, ఆ తర్వాత జిల్లా కార్యాలయానికి, లేదంటే గారకు బదిలీపై తీసుకువస్తానని చెప్పి డబ్బులు తీసుకున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. బాధిత ఉద్యోగి తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకుంటే భానుప్రతాప్ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి ఇంటిముందు బైఠాయిస్తానని హెచ్చరించినా డబ్బులు ఇవ్వలేదని తెలిసింది. వసూలు చేసిన డబ్బులన్నీ ఏడీకి ఇచ్చినట్టు భానుప్రతాప్ తన సహోద్యోగులకు చెప్పినట్టు గుసగుసలు ఉన్నాయి. అయితే ఏడీ మాత్రం తనకు సంబంధం లేదని చెప్పినట్టు సర్వే ఉద్యోగులు చెబుతున్నారు. భానుప్రకాష్ ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారు.






# నైపుణ్యతతోనే ఉపాధి అవకాశాలు

### - సందడిగా పద్మావతి ఫేర్‌వెల్ డే -



(సత్యంన్యూస్, నరసన్నపేట)

నైపుణ్యతతోనే ఉపాధి అవకాశాలు పొందవచ్చని వ్యక్తిత్వ వికాస నిపుణులు దుప్పల రవికుమార్ అన్నారు. మంగళవారం స్థానిక పద్మావతి జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఫేర్‌వెల్ డే సందడిగా సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేర్చుకున్న జ్ఞానం పదిమందికీ ఉపయోగపడుతూ సమాజహితం కావాలని ఆయన అన్నారు. సాంకేతికంగా ప్రపంచం మారుతోందని, రేపటి రోజుల్లో విప్లవాత్మకమైన మార్పులు రాబోతున్నాయన్నారు. దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం యువత పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరక్టర్ సిహెచ్ దుర్గాప్రసాద్, పాగోటి రామచంద్రరావు, ఎన్.కైలాసరావు, అధ్యాపక, విద్యార్థుల బృందం పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకగా సాగాయి.

# విజయవంతంగా ఆర్జీయుకేటీ వైద్య శిబిరం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆర్జీయుకేటీ శ్రీకాకుళం క్యాంపస్-2లో మంగళవారం సహాయ మిత్ర సంస్థ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఆర్జీయూకేటీ శ్రీకాకుళం డైరెక్టర్ బాలాజీ, ఏవో రామకృష్ణ, ఎఫ్‌వో వాసు, డీన్ అకడమిక్స్ మోహన్ కృష్ణచౌదరి, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ రవి గేదల, క్యాంపస్-2 ఇన్‌చార్జ్ సాగర్ సహకారంతో మెడికవర్, జెమ్స్ హాస్పిటల్స్, న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంక్‌తో కలిసి ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించగా, 300 మందికి పైగా విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. శిబిరంలో చర్మ సంబంధిత సమస్యలు, సాధారణ ఆరోగ్య సమస్యలు, కంటి సమస్యల వంటి చికిత్సలను వైద్యులు అందించారు.

# పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

### - ఎన్‌వైకే డీడీ వెంకటే ఉజ్వల్ -

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని నెహ్రూ యువకేంద్రం డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్ ఉజ్వల్ పేర్కొన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, నెహ్రూ యువక కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. యువత లక్ష్యసాధన వైపు అడుగులు వేయాలని సూచించారు. చెడువ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్సీసీ అధికారి కెప్టెన్ వై.పోలినాయుడు, ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ ఆర్.శ్రీనివాస పాత్రో, ఎంవీ సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.




Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.